ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 17
సంచిక : 96
పేజీలు : 4

గురువారం, డిసెంబర్ 11, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఎన్నికల ఘర్షణలో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

### గ్రామంలో ఉద్రిక్త వాతావరణం



**టీ మీడియా, డిసెంబర్ 10,నూతనకల్:** మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలోగ్రామ పంచాయతీ ఎన్నికలప్రచారం రణరంగాన్ని తలపించింది.రాజకీయ వర్గాల ఘర్షణలో ఒక నిండు ప్రాణం బలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి గ్రామంలో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహిస్తుండగా ఇరువర్గాలు ఎదురుపడ్డాయి. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది.క్షణికావేశంలో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేసుకున్నారు.?ఈ దాడిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్త ఉప్పుల మల్లయ్య తీవ్రంగా గాయపడ్డారు.గమనించిన

మిగతా 4లో

# నేడు మొదటి విడత పోలింగ్

- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**టి మీడియా,డిసెంబర్ 10,ఖమ్మం:** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే గ్రామాల్లో పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశామని, ప్రజలు ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపు నిచ్చారు.

డిసెంబర్ 11న మొదటి విడతలో నిర్వహించే గ్రామ పంచాయతీల ఎన్నికల సందర్భంగారఘునాథపాలెం మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.

డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ లో వినియోగించే ఎన్నికల సామాగ్రిని పరిశీలించి, పోలింగ్ సిబ్బందితో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పలు సూచనలు చేస్తూ, ఓటర్ లకు బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ నింపడం, అన్ని ఫార్మ్స్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ తీసుకోవడం, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీలింగ్, ఓట్ల కౌంటింగ్, సర్పంచ్ నియామక పత్రాలు ఇవ్వడం, ఉప సర్పంచ్ ఎన్నిక తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులు నిర్వహించే వారు, వారికి ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి డిసెంబర్ 11 గురువారం మొదటి విడతలో జిల్లా నందు ఏడు మండలాలలో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ నిర్వహించి, ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తి చేసి ఫలితాలను వెల్లడిస్తామన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించామని వివరించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లొకేషన్స్ గుర్తించి క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామని, సీసీ కెమెరా ద్వారా నిరంతర పర్యవేక్షిస్తామని, సెన్సిటివ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లు నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీ పోలింగ్ లో ప్రజలు ఎటువంటి ఒత్తిడులు, భయాందోళనలు లేకుండా తమ ప్రజాస్వామ్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించాలని అన్నారు. గ్రామంలో ప్రతి ఓటు విలువైనదని, ఓటర్లు అందరూ నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చి, ఎవరి ప్రభావానికి లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని కలెక్టర్ కోరారు.గ్రామ పంచాయతీ

మిగతా 4లో

### ముగిసిన మావోయిస్టు

## ఆనంద్ అంత్యక్రియలు



**టీ మీడియా, డిసెంబర్ 10,అశ్వాపురం :** మండలానికి చెందిన మావోయిస్టు అగ్ర నాయకుడు ఆనంద్ అనారోగ్యంతో స్వగ్రామం చింత్రియాలలో మృతిచెందారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీలో పనిచేసిన ఆయన ఇటీవలే అరెస్టయి వృద్ధాప్యంతో బాధపడుతున్నారు. పార్టీలో అనంద్ గా పేరొందిన ఆయన అసలు పేరు తోట సీతారామయ్య. చీరాలలో బీఎస్సీ చదువుకుంటున్నప్పుడు రాడికల్ విద్యార్థి సంఘంలో భాగమయ్యారు. 1980లో పూర్తికాలం కార్యకర్తగా పనిచేశారు. మొదటగా ఆర్గనైజేషన్ రంగంలో పనిచేశారు. 1986లో పీస్ బుక్ సెంటర్ మూత పడ్డాక పీపుల్స్ వార్ కేంద్ర కమిటీ, ఏపీ రాష్ట్ర కమిటీ స్టాఫ్‌లో భాగంగా పట్టణాలలో పనిచేశారు.నిర్బంధం కారణంగా పట్టణాల్లో పనిచేయలేని పరిస్థితుల్లో ఆనంద్ కేంద్ర కమిటీ పనుల్లో భాగంగా 1995 తర్వాత దండకారణ్యానికి వచ్చారు. సీసీ వాళ్ళ డాక్యుమెంట్స్ టైపింగ్, కరెక్షన్స్ ఇంకా సర్క్యులర్స్ టైపింగ్స్ అన్నీ ఆనందే చేసేవాడు. పీపుల్స్ వార్, అనంతరం మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి గణపతి (ముప్పాల లక్ష్మణ రావు) వద్ద చాలాకాలం పనిచేశారు. మితంగా మాట్లాడే ఆయన దశాబ్దల పాటు అజ్ఞాతంలో పనిచేశారు. తీవ్రమైన అనారోగ్య సమస్యతో, ట్రీట్ మెంట్ కోసం వచ్చి హైదరాబాద్‌లో 2023లో అరెస్టు అయ్యారు. ఆ తరువాత బెయిల్‌పై ఇంటికి వచ్చారు. తాజాగా ఆయన మృతిచెందడంతో వామపక్ష నేతలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆనంద్ మృతికి సంతాపం ప్రకటిస్తున్నారు. అంత్యక్రియలలో ఆరుణ పతాకం కప్పి నివాళి అర్పించారు.

# మండలంలో కలెక్టర్ పర్యటన

- ఏర్పాట్లు పరిశీలన



**టి మీడియా,డిసెంబర్ 10, చర్ల**

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి బుధవారం చర్ల మండలంలో విస్తృత పర్యటన నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు మరియు గ్రామీణ మహిళా ఉత్పాదక యూనిట్ల పనితీరుపై సమగ్ర సమీక్ష చేస్తూ పలు కీలక సూచనలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా ముందుగా చర్ల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రిలోని ప్రతి వార్డు, ఎమర్జెన్సీ, గైనకాలజీ, పీడియాట్రిక్, లేబర్ రూమ్, ల్యాబ్, ఫార్మసీ, మొత్తం మౌలిక సదుపాయాలను సవివరంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, పరికరాల పనితీరు, పరిశుభ్రత, వైద్య సిబ్బంది హాజరు, రికార్డు లు పరిశీలించారు. ఇన్ పేషంట్ వార్డ్ లో ఉన్న రోగులతో మాట్లాడుతూ వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కొన్ని చోట్ల ఉన్న చిన్నచిన్న లీకేజీలు, మరమ్మత్తులు, గుర్తించిన కలెక్టర్ తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలు, అభివృద్ధి పనులపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని వైద్య అధికారిని ఆదేశించారు. గర్భిణీలకు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవల నాణ్యతను పరిశీలించి సిబ్బందిని అభినందించారు.తరువాత కలెక్టర్ చర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పంచాయతీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలోని ప్రతి కౌంటర్‌ను, పోలింగ్ సిబ్బందికి అందజేస్తున్న సామాగ్రి పంపిణీ విధానాన్ని, చెక్‌లిస్ట్ ప్రకారం జరుగుతున్న ప్రక్రియలను సవివరంగా పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, సీల్‌లు, స్టాంపులు, ఫారమ్‌లు తదితర ఎన్నికల సామాగ్రి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయా అని తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా సిబ్బంది హాజరు, డబుల్-లాక్ సిస్టమ్‌ను పరిశీలించి ఎటువంటి భద్రతా లోపాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్, ఎన్నికలను పూర్తిగా పారదర్శకంగా, తప్పులు లేకుండా నిర్వహించడానికి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలింగ్ సిబ్బందికి

మిగతా 4లో



### అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

## పనులు పూర్తి కావాలి

- నాణ్యతలో రాజీ పడొద్దు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**టీ మీడియా, డిసెంబర్ 10,మధిర :**మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మధిర పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అన్ని నిర్ణత సమయానికి పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన మధిర క్యాంపు కార్యాలయంలో మధిర మున్సిపాలిటీకి సంబంధించిన అభివృద్ధి పనుల ప్రగతిపై వివిధ శాఖ అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. కింది స్థాయిలో పనిచేసే అధికారులు సమస్యలను ఎప్పటికప్పుడు వాట్సాప్ గ్రూప్ లో పోస్ట్ చేయాలి.. ఉన్నతాధికారులు వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను క్వాలిటీ అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఎప్పుడు మొదలుపెట్టారు? ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి? నిర్ణీత సమయానికి పనులు పూర్తి కావాలంటే

మిగతా 4లో



## ఏమి వెలగబెట్టారని ఓట్లు అడుగుతున్నారు

### గ్రామ అభివృద్ధి కావాలంటే బాల చందర్ గెలవాలి

### -గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

**టీ మీడియా, డిసెంబర్ 10, ముదిగొండ :**గత ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో గ్రామానికి ఏమిచ్చారని ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలలో ఓట్లు అడుగుతున్నారు అని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కందుల బాలచందర్ గెలుపు కోసం బుధవారం రాయల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో అంగన్వాడి కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా గ్రామాన్ని పాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సర్పంచ్ గా గెలిచి ఒక ఇల్లు ఇచ్చావా, ఒక్క రేషన్ కార్డు ఇచ్చావా అని నిలదీశారు. ఏ మొఖం పెట్టుకొని మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామానికి 24 ఇండ్లు వచ్చాయన్నారు. ఇంకా 75 ఇండ్లు రెండో విడతలో వస్తాయన్నారు. ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు వచ్చిందన్నారు. కందుల బాలచందర్ స్థలం లేని నిరుపేదలందరికీ వంద గజాలు చొప్పున స్థలం ఇస్తారని మరియు ఆ స్థలంలో ఇందిరమ్మ ఇండ్లు కట్టించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుంది అన్నారు. ఎవరు ఏ పార్టీ నుంచి పోటీ చేసిన ఆఖరికి తన తండ్రి అయిన నా మద్దతు ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీకే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పువాల దుర్గాప్రసాద్, సర్పంచ్ అభ్యర్థి కందుల బాలచందర్, గుడి పూడి ఝాన్సీ, బుచ్చి రామయ్య, హరీష్, గంట వెంకట్రావు, గంటా కృష్ణ, చిర్ర శ్రీను, గంట శ్రీను, తోటమల్ల ఉదయ్ కుమార్, బంక లక్ష్మయ్య, షేక్ ఖాసిం, పల్లె సురేష్ కట్టారి బాబా, కాంపాటి కోటి, వార్డు అభ్యర్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బాణాపురంలో కాంగ్రెస్ ప్రచారం

### -సర్పంచ్ అభ్యర్థి తేజవత్ సంధ్యకు ప్రజాదరణ

**టీ మీడియా, డిసెంబర్ 10, ముదిగొండ:**ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి తేజవత్ సంధ్య తరపున కాంగ్రెస్ పార్టీ ప్రచారం బుధవారం జోరుగా సాగింది. ఈ ప్రచార కార్యక్రమానికి తెలంగాణ డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సతీమణి మల్లు నందిని, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ప్రత్యేక అతిథులుగా హాజరై గ్రామాన్ని సందర్శించారు.గ్రామస్తుల నుండి ఉత్సాహవంతమైన స్వాగతం ప్రచార కార్యక్రమం సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై నాయకులను ఆహ్వానించారు. గ్రామ ప్రజలను పలకరిస్తూ మల్లు నందిని మాట్లాడుతూ,"గత కొన్నేళ్లలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేరువై వారి అసలు సమస్యలను అర్థం చేసుకుని పరిష్కారం చూపుతున్న ఏకైక పార్టీ. బాణాపురం అభివృద్ధి కోసం తేజవత్ సంధ్యకి మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాను" అని తెలిపారు..ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ,గ్రామాభివృద్ధి మా ధ్యేయం గ్రామంలో ప్రాథమిక వసతుల మెరుగుదల, సంక్షేమ పథకాల విస్తరణ, రైతులకు సహాయం వంటి అంశాలను ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం కట్టుబడి పనిచేస్తుందని గుర్తు చేశారు.సర్పంచ్ అభ్యర్థి తేజవత్ సంధ్య మాట్లాడుతూ,"గ్రామాభివృద్ధి కోసం నేను కట్టుబడి పనిచేస్తాను. మన కత్తెర గుర్తుకు ఓటు వేయాలని మీ అందరినీ వినయపూర్వకంగా కోరుతున్నాను" అని సమావేశంలో ప్రజలకు అపీలిచేశారు.బాణాపురం గ్రామాన్ని అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకువెళ్తాను. పారదర్శక పాలన, గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండే సేవలు నా ముఖ్య లక్ష్యాలు" అని పేర్కొన్నారు. అధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామస్థులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంధ్యకు తమ మద్దతు ప్రకటించారు.

## ప్రారంభమయిన ఖమ్మం బాలోత్సవం




**టి మీడియా,డిసెంబర్ 10,ఖమ్మం:** స్థానిక ఖమ్మం మంచికంటి ఫంక్షన్ హాల్ నందు నేటి ఉదయం 10 గంటలకు నుండి శుక్రవారం అనగా 12 /12/2025 సాయంత్రం 6 గంటల వరకు మూడు రోజులపాటు ఖమ్మం నగర బాలోత్సవంను చాలా ఘనంగా ప్రారంభించటం జరిగింది. ముందుగా జాతీయ జెండా మరియు బాలోత్సవం జెండాను బోడేపూడి విజ్ఞాన కేంద్రం జనరల్ మేనేజర్ మరియు బాలోత్సవం కన్వీనర్ వై శ్రీనివాసరావు, తుమ్మల వెంకట్రావు ఆవిష్కరించారు. అనంతర ప్రారంభం సందర్భంగా రిబ్బన్ కటింగ్ బాలోత్సవం నిర్వాహకురాలు శ్రీమతి కానూరి హిమబిందు చేసారు..

బోడేపూడి విజ్ఞాన కేంద్రం, టి పి ఎస్ కె, ఆల్ పెన్షనర్స్, జె వి వి మరియు ఎస్ ఎఫ్ ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో ఖమ్మం నగర బాలోత్సవంను ఘనంగా నిర్వహించడం జరిగింది.. నగర నలుమూలల నుండి వివిధ విద్యా సంస్థల బాల-బాలికలు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో బాలోత్సవం కన్వీనర్ వై శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి నుండి మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్రమంకు విశేష ఆదరణ లభించిందని, ఈ కార్యక్రమం నుంచి జయప్రదం చేయడానికి బాలోత్సవ నిర్వాహక బృందం చాల కృషి చేసారని అదే విధంగా వివిధ ప్రభుత్వ మరియు ప్రయివేటు విద్యా సంస్థలు తమ తమ స్టూడెంట్స్ ని పంపించి జరగబోయే అన్ని కార్యక్రమాలలో భాగస్వామ్యం చేసినందుకు అభినందనలు తెలియచేయడం జరిగింది.. ఈ



కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ మెంబర్స్ కె హిమబిందు, సామినేని నాగేశ్వరరావు, జనార్ధన్ స్వామి, వాసిరెడ్డి వీరభద్రం,ఎస్ కె అఫ్జల్,ఎన్ గోవిందరావు,వై మధు సూదన్ రావు,ఎమ్ సుబ్బారావు,ఎస్ కె జానీ,వివి లక్ష్మీ నారాయణ, వై రవికుమార్, జి శ్రీదేవి, మెహన్, కళ్యాణం నాగేశ్వరరావు, సీత, విజయలక్ష్మి, ప్రమీల, మల్లిక, రామారావు, పారుపల్లి అరుణ, విప్లవ్, బండారు రమేష్ ,తాతా రాఘవయ్య,భాష్కర్ రావు,రామశేఖరం,పుచ్చకాయల వెంకటేశ్వరరావు, కె రాములమ్మ,లిమచ్చా సూర్యం తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతలుగా ఆయా సబ్జెక్ట్స్ కు సంబంధించిన నిపుణులు వ్యవహారించారు.



## సిపిఎం అభ్యర్థి రాయల వెంకటేశ్వర్లు గెలుపు కోసం బైక్ ర్యాలీ



**టీ మీడియా, డిసెంబర్ 10 ,ముదిగొండ** : మండలం వెంకటాపురం గ్రామ అభివృద్ధి ప్రదాత, బి ఆర్ ఎస్ , టీడీపీ బలపరిచిన సిపిఎం సీనియర్ లీడర్ రాయల వెంకటేశ్వర్లు గెలుపు కోసం కార్యకర్తలు బుధవారం గ్రామంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమం మాజీ సిపిఎం సర్పంచ్ బంక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముందుగా మెయిన్ సెంటర్ నుంచి ప్రతి వీధిలో బైక్ ర్యాలీ చేపట్టి సర్పంచ్ అభ్యర్థి గుర్తు కత్తెర గుర్తు పై ఓటు వేసి గెలిపించాలసిందిగా కోరారు. గ్రామ యువత, మహిళలు, వృద్ధులు ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే కార్యక్రమాలు అమలు చేయడానికి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బంక వెంకటేశ్వర్లు, కందుల రంగారావు, అంజలి, బంక వెంకటేశ్వర్లు, కొండ్రు రమేష్, బంక శ్రీను, విజయ్, వినోద్, మాజీ వార్డ్ మెంబర్ నాగేశ్వరావు, వెంకటేష్, ఫణిందర్, రాము, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




## క్వింటాకి 200 కొట్టు బండి లోపల పెట్టు

### సీసీఐ బయర్ సంజయ్ సంజయ్

### దళారులకు వర్తించని నిబంధనలు

**టీ మీడియా, డిసెంబర్ 10,కారేపల్లి(సింగరేణి):**సింగరేణి మండలం అప్పయ్యగూడెం గ్రామపంచాయతీ పరిధిలోగల సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు రైతుల ఆవేదన. సీసీఐ అధికారుల కింద పని చేస్తూ వ్యవహరిస్తున్న అసిస్టెంట్ బయ్యర్ సంజయ్ అనే ఉద్యోగి రైతులపై అనుచితంగా మాట్లాడుతున్నాడని, క్షమాపణ చెప్పకపోతే బండి పాస్ చేయకుండా బెదిరిస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతుల విలేకరులతో మాట్లాడుతూుమా బండ్లకు పాస్ కావాలంటే సంజయ్ డబ్బు కోరుగుతున్నాడు. ఒక్కో బండికి 5,000 వరకు ఇవ్వాల్సిందే అని బలవంతం చేస్తున్నాడు. క్షమాపణ చెప్పమంటూ అవమానకరంగా మాట్లాడతాడు. ఇలా మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడు" అని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులపై ఇలాంటి దౌర్జన్యానికి తక్షణ చర్యలు తీసుకొని సీసీఐ అధికారులు విచారణ జరపాలని, రైతులకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.సీసీఐ వంటి సంస్థలో అవినీతి, అవమానం చోటుచేసుకోవడం రైతుల్లో ఆగ్రహం రేపుతోంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి రైతుల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## ప్రచారం లో దూసుకుపోతున్న

## అలవాల లింగయ్య

**టి మీడియా, డిసెంబర్ 10, కూసుమంచి:**మండల పరిధిలోని నేలపట్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి గా బిఆర్ఎస్ మద్దతు తో పోటీ చేస్తున్న యువకుడు,విద్యా వంతుడు,ఖమ్మం ఆర్జేసి కళాశాల ప్రిన్సిపాల్ అయిన అలవాల లింగయ్య ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు.ఈనెల 14న జరగనున్న ఎన్నికల్లో తన గుర్తు అయిన ఉంగరం పై ఓటువేసి తనను అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని కోరుతూ గ్రామంలోని వృద్ధులు,మహిళలు,యువతను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.ప్రచారం సందర్భంగా లింగయ్యకు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు.మహిళలు ఎదురేగి హారతులు పట్టి ఆశీర్వదిస్తున్నారు.దీనిలో భాగంగా బుదవారం కూడా ఆయన ఇంటింటి కి తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా లింగయ్య మట్లాడుతూ రానున్న ఎన్నికలలో నేలపట్ల సర్పంచ్ గా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవ చేస్తానన్నారు.పంచాయతీ కి రావాల్సిన నిధులను సాధించేందుకు కృషి చేస్తానని,తద్వారా గ్రామంలో నెలకొని ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో దోమల. వెంకులు, చెరుకుపల్లి నాగయ్య, జాల నాగయ్య, నీరుడు సంగయ్య, కొప్పుల గురవయ్య, మరియు వార్డ్ సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**టీ మీడియా, డిసెంబర్ 10,కోదాడ:** మండల పరిధిలోని ఎర్రవరం గ్రామానికి చెందిన నాగుల్ మీరా అనారోగ్యంతో మృతిచెందాడు. అతని కుటుంబాన్ని పరామర్శించిన తెలంగాణ విద్యా సమితి అధ్యక్షుడు తారక్ గౌడ్ తన మిత్ర బృందంతో కలిసి బుధవారం 50 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పెండెం వెంకట్రాం, షేక్ లతీఫ్, బూరా శ్రీను, ఉద్దండు, శ్రీనివాసు, వరదయ్య, వెంకటేశ్వర్లు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.





## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయ బృందం

**టి మీడియా, డిసెంబర్ 10, మహబూబాబాద్** : స్థానిక జిల్లా కేంద్రంలోని అనంతరం శివారు ఆదర్శ పాఠశాల విద్యార్థి గుంటి ముని ప్రసాద్ ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఇటీవల మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు లో జరిగినటువంటి రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ ఐ స్క్వాష్ పోటీలలో పాఠశాల నుంచి వరంగల్ జిల్లా తరఫున పాల్గొనగా అందులో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది .అని ప్రిన్సిపల్ జి. ఉపేందర్ రావు తెలిపారు . మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో ఈనెల 11 నుంచి 14 వరకు జరిగే అండర్ 17 ఎస్ జి ఎఫ్ ఐ జాతీయస్థాయి స్క్వాష్ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థి ఉమామహేశ్వర్ ని ప్రిన్సిపాల్ జి .ఉపేందర్ రావు, పిడి కె ఎస్ వర్మ, మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.



## గ్రామపంచాయతీలో రాజకీయ ఉద్రిక్తతలు

### తెరాస-కాంగ్రెస్ మధ్య ఘర్షణ

**టి మీడియా,డిసెంబర్ 10, మధిర:** తోండల గోపవరం గ్రామపంచాయతీలో తెరాస (బీఆర్ఎస్) మరియు కాంగ్రెస్ పార్టీల మధ్య చోటుచేసుకున్న గొడవ రాజకీయ ఉద్రిక్తతలకు దారి తీసింది. గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ముఖ్యంగా అధికార పార్టీ హెూదాను అడ్వాంటేజ్‌గా తీసుకుంటూ కొందరు కాంగ్రెస్ నాయకులు అహంభావంతో వ్యవహరిస్తూ సామాన్య ప్రజలపై అనవసర వత్తిడి తీసుకొస్తున్నారని తెరాస నాయకులు ఆరోపిస్తున్నారు.గ్రామంలో అభివృద్ధి పనులు, రాజకీయ కార్యకలాపాల విషయంలో విభేదాలు తలెత్తడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదాలు చోటుచేసుకున్నాయని సమాచారం. రాజకీయ ప్రయోజనాల కోసం సామాన్యులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని పలువురు గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.తెరాస నేతలు మాట్లాడుతూ, అధికార పార్టీ పేరుతో బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. గ్రామంలో శాంతి భద్రతలను భంగం కలిగించే చర్యలను తక్షణమే అరికట్టాలని, అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఇదిలా ఉండగా, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు స్థానిక అధికారులు అప్రమత్తమయ్యారని తెలుస్తోంది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. మొత్తంగా తోండల గోపవరం గ్రామంలో రాజకీయ వేడి కొనసాగుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

## రెవెన్యూ జీపీఓల నూతన కమిటీ ఎన్నిక

**టీ మీడియా, డిసెంబర్ 10, పెనుబల్లి**



మండలంలోని రెవెన్యూ జీపీఓల నూతన కమిటీ ఎన్నిక సోమవారం పెనుబల్లి తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా బానోతు రవి, నేరేటి శారద ఎన్నికయ్యారు. సభ్యులుగా తాటి నాగరాజు, ఎస్.కె నాగులమీరా, తేనె బేబీ, మేకల ప్రవీణ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# ఆదరించండి గెలిపించండి

### -సర్పంచ్ అభ్యర్థి బానోత్ సదర్ లాల్

**టీ మీడియా డిసెంబర్ 10 , అశ్వాపురం :** ప్రజా సమస్యలే ఎజెండాగా ముందుకు వెళ్తానని వాటిని పూర్తి అయ్యేంతవరకు నిద్రపోనని మండలంలోని అశ్వాపురం గ్రామపంచాయతీని ప్రథమ స్థాయిలో నిలబెట్టే దిశగా పనిచేస్తానని సర్పంచ్ అభ్యర్థి సదర్ లాల్ అన్నారు. అదేవిధంగా నేను చేసిన ఉద్యోగంలో కార్మికుల వైపు ఒక ప్రధానమైన యూనియన్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఇదే అశ్వాపురం గ్రామపంచాయతీకి నా సహచరధర్మచారిణి శారదా లాల్ సర్పంచ్ గా రెండు పర్యాయాలు పని చేసిన సమయంలో ప్రజలతో మమేకమైన విషయం పంచాయతీలో ప్రతి మూలలో ఏ సమస్య ఉన్నదనో ఇట్టే తెలిసే విధంగా ప్రజలలోకి వెళ్లి సమస్యను పరిష్కరించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని ఆ అనుభవంతోనే సర్పంచ్ ఎన్నికల బరిలో నిలబడుతున్నానని ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తారని నమ్మకం ఉన్నదని అన్నారు. గ్రామపంచాయతీ లోని సమస్యల విషయమై మాట్లాడుతూ పంచాయతీలో అతిపెద్ద సమస్య డ్రైనేజీ సమస్యని వర్షాకాలం వస్తే అశ్వాపురం గ్రామపంచాయతీలో ఆ సమస్య తీవ్రతరం అవుతుందని వర్షపు నీరు ఎటు వెళ్ళాలో తెలియక ఇండ్లలోకి వెళ్ళటం వల్ల ఇండ్లు కూలిపోయిన,మునిగిపోయిన సందర్భాలు ఉన్నాయని మొట్టమొదటగా డ్రైనేజీ సమస్యను ఎంత ఖర్చైనా పై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.ప్రధాన రహదారి వెంబడి వ్యాపార సముదాయాలలో ఈ సమస్య పెద్దగా ఉన్నదని అది పరిష్కరించే దిశగా అటువైపే మొదటి అడుగు అన్నారు. గ్రామపంచాయతీలో సిమెంట్ రోడ్లు మరొక ప్రత్యేకమని ఎక్కడ మట్టి రోడ్డు ఉండకుండా చేయడమే లక్ష్యమని ప్రతి ఒక్క వీధిలో కరెంటు ఉండే విధంగా వీధి స్తంభాలు, లైట్లు వాటి నిర్వహణ పనితీరు పై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. గ్రామపంచాయతీలోని మరొక సమస్య సంత నిర్వహణ సంత దుకాణాలు మండల రెవెన్యూ కార్యాలయం దారిలో ప్రధాన రహదారిపై ఉండటం వల్ల రాకపోకలకు వాహనాలకు ప్రజలకు ఇబ్బంది అని భారజల ఉద్యోగులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ఎట్టి పరిస్థితుల్లో సంత నిర్వహణకు ప్రత్యేక స్థలాన్ని ప్రధాన రహదారి వెంబడి కాకుండా ప్రజలకు చేరువలో ఉండే విధంగా చేస్తానని అన్నారు. పంచాయతీలో మరొక అతిపెద్ద సమస్య చెత్త. గ్రామపంచాయతీని పరిశుభ్రతగా ఉంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తానని ప్రధాన రహదారి వెంబడి కూడలిలో పంచాయతీలోని వీధులలో చెత్త కుండీలు ఏర్పాటు చేసి ఏ వీధిలో కూడా చెత్తను ఉంచకుండా ప్రతి వీధి పరిశుభ్రతగా ఉంచే విధంగా స్వచ్ఛ అశ్వాపురం చేసే విధంగా కృషి చేస్తానని అన్నారు. పంచాయతీలోని ప్రతి సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తానని చివరగా నన్ను



నమ్మి ఓటేసిన ప్రజలకు వారి రుణం తీర్చుకునే విధంగా ఏ సమస్య అయినా కచ్చితంగా పరిష్కరించే దిశగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు నాయకులు అశ్వాపురం గ్రామ ప్రజల ఆశీర్వాదంతో నా యొక్క అనుభవము వయస్సు సర్పంచిగా గెలవడానికి ఉపయోగపడతాయని ప్రతి ఒక్క ఓటరు ఆయనపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

### కలకోట పిఏసిఎస్

# అధ్యక్షుడిగా రాధాకృష్ణ

### సొసైటీ -కర్నాటి రామకోటేశ్వరరావు రాజీనామా



**టీ మీడియా, డిసెంబర్ 10,బోనకల్ :** ఖమ్మం జిల్లా బోనకల్ మండల పరిధిలోని కలకోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా మారేపల్లి రాధాకృష్ణ ను పాలకవర్గం ఎన్నుకుంది. కలకోట సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం బుధవారం జరిగింది. నేటి వరకు సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న మధిర ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు రాయన్నపేట కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీంతో కలకోట సొసైటీ అధ్యక్ష పదవికి కర్నాటి రామకోటేశ్వరరావు రాజీనామా చేశారు. కర్నాటి రామకోటేశ్వరరావు రాజీనామా చేయటంతో నూతన అధ్యక్ష ఎన్నిక అనివార్యమైంది.సొసైటీ ఉపాధ్యక్షుడిగా ఉన్న కాంగ్రెస్ కు చెందిన మారేపల్లి రాధాకృష్ణ ను నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. తనను నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు మాజీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు, పాలకవర్గం డైరెక్టర్లకు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్ కు మారేపల్లి రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కర్నాటి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలపాటు తనకు సహకరించిన పాలకవర్గ సభ్యులకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో సహకార సంఘ అభివృద్ధికి తన శక్తి మేరకు కృషి చేశాను అన్నారు. మారేపల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తన పదవీకాలంలో కలకోట సొసైటీ అభివృద్ధికి రైతుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కర్నాటి రామకోటేశ్వరరావు ప్రారంభించిన అన్ని పనులను పూర్తి చేస్తానన్నారు.

## గంధసిరిలో బీఆర్ఎస్ అభ్యర్థి

## లక్ష్మారెడ్డి ముమ్మర ప్రచారం

**టీ మీడియా, డిసెంబర్ 10, ముదిగొండ**

మండలంలోని గంధసిరి గ్రామంలో సీపీఐ(ఎం) బలపరిచిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి వాచేపల్లి లక్ష్మారెడ్డి ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. తన గుర్తు కత్తెర గుర్తుతో నమూనా బ్యాలెట్ చూపిస్తూ ఇంటింటి ప్రచారంలో ముందుకు వెళ్తున్నారు. గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపించాలంటే, బీఆర్ఎస్ పార్టీ వల్లనే సాధ్యమవుతుందన్నారు. లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారానికి ప్రజల నుండి ప్రభంజనాలు విశేష స్పందన లభిస్తుంది.లక్ష్మారెడ్డి గ్రామంలోని ప్రజా క్షేత్రంలో నిలబడి ప్రజా సమస్యల కోసం కృషిచేసి ప్రజా సంక్షేమానికి పాటుబడిన, వ్యక్తిగా, గ్రామంలో లక్ష్మారెడ్డికి మంచి గుర్తింపు ఉంది. గ్రామ ప్రజల ఆశీస్సులు,నిరాజనాలు లభించడంతో లక్ష్మారెడ్డి గెలుపు సునాయాసమేనంటూ సంకేతాలు వినిపిస్తున్నాయి. లక్ష్మారెడ్డి తన ప్రత్యర్థి అధికార పార్టీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి మల్లెల రామారావుపై పోటీ పడుతున్నారు. వీరి మధ్య సర్పంచ్ అభ్యర్థి ప్రచార సమరం హెూరాహెూరీగా నడుస్తుంది.



## పాత విద్యుత్ స్తంభాలను తొలగించాలని వినతి

**టీ మీడియా, డిసెంబర్ 10,ఇల్లెందు :** ఇల్లందు పట్టణంలోని 18వ వార్డు పరిధిలోని ఆంబజార్, కళాసి బస్తి, పటేల్ చౌక్ ప్రాంతాల్లో సుమారు 50%-%60 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఐరన్ విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకొని ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. ఎప్పుడైనా కూలిపోతాయనే భయంతో స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం 18వ వార్డ్ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు నరేంద్రుల అనుబాబు ఆధ్వర్యంలో పట్టణ విద్యుత్ శాఖ ఏ.ఈ. సతీష్ కు వినతి పత్రం అందజేశారు.పాత ఐరన్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో నూతన సిమెంట్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఏ.ఈ. సతీష్ మాట్లాడుతూ పటేల్ చౌక్, ఆం బజార్, కళాసి బస్తి, స్టేట్ బ్యాంక్ మార్గంతో పాటు పలు గల్లీల్లో ఉన్న ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి తొలగింపునకు తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. ఈ పనుల్లో ప్రజలు, వ్యాపారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

### భద్రాద్రి పవర్ ప్లాంట్ సిఈ బిచ్చన్న



**టీ మీడియా, డిసెంబర్ 10,మణుగూరు:** ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని, తద్వారా ప్రాణ దాతలు కావాలని భద్రాద్రి పవర్ ప్లాంట్ సిఈ బిచ్చన్న ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం కింగ్ డామ్ కల్చర్ మినిస్ట్రీ, హెల్పింగ్ హాండ్స్ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యంగా యువత అపోహలు మాని రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా బిటిపిఎస్ ఉద్యోగులు, ఎస్పిఎఫ్ సిబ్బంది పాల్గొని 114 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి గోపాలకృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్లు సూర్యనారాయణ, రమేష్ బాబు, డివిజనల్ ఇంజనీర్లు మురళీకృష్ణ, ఆనంద ప్రసాద్, భీమ్యా, వెంకటనాయుడు, శరత్ అసిస్టెంట్ మేనేజర్ (హెచ్ఆర్) సుగుణాకర్ రావు, ఆరిఫ్, ప్రసాద్, సాదిక్, రామ చందర్ పాల్గొన్నారు.



## బాధితులకు ఆర్థిక సహాయం అందజేత

**-ఎల్లవేళలా అండగా భరోసా కేంద్రం..**

**టీ మీడియా, డిసెంబర్ 10,ములుగు బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వం పోలీస్ మహిళా భద్రతా విభాగంలో భాగంగా మహిళలలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు భరోసా సెంటర్ లను ఏర్పాటు చేశారు. మహిళలు, పిల్లలు వారు ఎదుర్కొంటున్న లైంగిక, అత్యాచార హింసలు వంటి వేధింపులకు సహాయాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకొని బాధితులకు వన్ స్టాప్ సొల్యూషన్ గా పనిచేస్తున్నాయి. మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారిలో భరోసా కల్పించే దిశగా ములుగు జిల్లాలో ఏర్పాటు చేసిన ఈ భరోసా కేంద్రం విజయవంతంగా పనిచేస్తుంది. సంబంధిత కేసులను త్వరగా, సమర్ధవంతంగా నిర్వహించేలా ఒకే పై కప్పు కింద వివిధ సేవలను అందించడంతో పాటు మానసిక చికిత్, కౌన్సిలింగ్, మెడికల్, లీగల్, ప్రాసిక్యూషన్ వంటి సేవలు భరోసా కేంద్రం అందిస్తుంది.ఇటీవల ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినటువంటి వివిధ సంఘటనలలో బాదితులకు భరోసా అసిస్టెంట్ ఫండ్ నుండి జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఆదేశాల మేరకు భరోసా నోడల్ ఆఫీసర్ ఈ. కిశోర్ కుమార్(డిఎస్పి), ఇంచార్జ్ రాజ్యలక్ష్మి.యం.(ఎస్ఐ), సెంటర్ కో ఆర్డినేటర్(అనూష), భరోసా సిబ్బంది బాధితులకు ఆర్థిక సహాయం అంధించడం జరిగింది. అలాగే ఆర్థికంగా వెనుకబడిన ఇద్దరు బాధితులకు పై చదువుల నిమిత్తం అయ్యే ఖర్చులను ఆర్థిక సహాయంగా ఇస్తానని భరోసా నోడల్ ఆఫీసర్ ఈ. కిశోర్ కుమార్(డిఎస్పి) తెలపడం జరిగింది. భరోసా సెంటర్ ఇంచార్జ రాజ్యలక్ష్మి. యం.(ఎస్.ఐ.)మాట్లాడుతూ ములుగు జిల్లాలో భరోసా సిబ్బంది వివిధ అవగాహన సదస్సులు, హెూమ్ విసిట్స్(భాదితుల) నిర్వహిస్తున్నారు అని తెలియజేయడం జరిగింది.



## మున్సిపాల్టీకి శిక్షణా కలెక్టర్ సౌరబ్ శర్మ

**-మున్సిపల్ కమీషనర్ గా బాధ్యతలు**

**టీ మీడియా, డిసెంబర్ 10,అశ్వారావుపేట:**పరిపాలనా శిక్షణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించబడిన శిక్షణా కలెక్టర్ సౌరబ్ శర్మ మూడు వారాల పాటు అశ్వారావుపేట మున్సిపాల్టీ చీఫ్ మున్సిపల్ కమీషనర్గా విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం అధికారికంగా విధుల్లో చేరారు. విధుల్లో భాగంగా ముందుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న ఆయన,వివిధ విభాగాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మున్సిపాలిటీ కార్యనిర్వహణ విధానాలపై కమిషనర్ బి.నాగరాజు ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం మున్సిపాల్టీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య నిర్వహణ,ఇంటి పన్నుల వసూలు,మౌలిక సదుపాయాల స్థితిగతులు పై స్థానికులతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. స్థానిక పరిపాలన పనితీరును క్షుణ్ణంగా అధ్యయనం చేయనున్నారు. ప్రస్తుతం సర్వే జరుగుతున్న దొంతికుంట చెరువు, అలాగే నిర్మాణానికి సిద్ధమవుతున్న మినీ స్టేడియం ప్రదేశాన్ని కూడా ఆయన పరిశీలించారు. ఈ పర్యటనలో శిక్షణా కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ నాగరాజు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల ఘర్షణలో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

స్థానికులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మల్లయ్య మృతి చెందారు.ఎన్నికల వేళ జరిగిన ఈ హత్యతో లింగంపల్లి గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో భారీగా మోహరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

# 20న టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా మహాసభ

**- జిల్లా కమిటీ, ఆహ్వానితుల సమావేశంలో నిర్ణయం**

**టీ మీడియా, డిసెంబర్ 10, ఖమ్మం:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా మహాసభలు ఈనెల 20వ తేదీన ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరెడ్డి, స్టేట్ అడ్ హక్ కమిటీ సభ్యులు సయ్యద్ ఖదీర్ వెల్లడించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ, ఆహ్వానితుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాకు చెందిన జర్నలిస్టులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు, ఆయా రంగాల ప్రముఖులు, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులను ఈ మహాసభలకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. జర్నలిస్టు మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్త అక్రిడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి, కొత్త కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులు ఎవ్వరికీ అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ప్రత్యేక పాలసీ ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళా జర్నలిస్టులకు రాత్రి వేళల్లో ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టు సంఘాలను రద్దు చేస్తూ కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్ ను రాష్ట్రంలో అమలు కాకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



**గందరగోళ పరిచేలా సోమయ్య ప్రకటనలు**

మామిడి సోమయ్యకు టీడబ్ల్యూజేఎఫ్ కు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ స్పష్టం చేశారు. సంఘం వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన సోమయ్య ను సంఘం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ రాష్ట్ర కార్యవర్గం, జనరల్ బాడీ తీర్మానం చేసిందని గుర్తు చేశారు. ఉనికి కోసమే ఆయన జిల్లాల్లో తిరుగుతూ జర్నలిస్టులను గందరగోళపరుస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు జక్కంపూడి కృష్ణ, కోటి శివారెడ్డి, దువ్వా సాగర్, కూరాకుల గోపీ, మానుకొండ రవికిరణ్, ఆవుల శ్రీనివాస్, షేక్ జానీపాష, కొత్త యాకేష్, మధుశ్రీ, దేవేందర్, కరుణాకర్ రెడ్డి, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కళాకారుల ప్రదర్శన

**ప్రమాదాల నివారణ, అతివేగం, వ్యక్తిగత రక్షణ**

**టీ మీడియా, డిసెంబర్ 10,మణుగూరు :** సింగరేణి 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల సందర్భంగా ప్రమాదాల నివారణ, అతివేగం, వ్యక్తిగత రక్షణ పరికరాల ధరింపుపై స్థానిక కళాకారులు పీకే ఓసిలో ప్రదర్శించిన రక్షణ సందేశం నాటిక సభికులను తన్మయత్నంకు గురిచేసింది. అందరిచేత ప్రశంసలు ప్రశంసలు పొందింది. స్థానిక కళాకారుడు సింగరేణి మాజీ ఉద్యోగి నాసర్ పాషా రచన దర్శకత్వంలో ప్రదర్శించిన ఈ కళా ప్రదర్శనలో కళాకారులు తమ పాత్రలకు జీవం పోశారు. విద్యుత్ వినియోగం, జాగ్రత్తలు, అశ్రద్ధ అనే ఇతివృతంగా సాగిన నాటిక ప్రదర్శన ఆధ్యాంతం ఆసక్తిగా కొనసాగింది. స్టేజి పైనే కార్మికుడికి విద్యుత్ ఘాతం దృశ్యం అందరిని సంబరమాశ్చర్యాలకు గురిచేసింది. సంస్థపై బాధ్యత కలిగిన తండ్రి పాత్రలో నాసర్ పాషా, రక్షణ సూత్రాల పట్టింపు లేని కార్మికునిగా జంగంరాజ్ కుమార్ చక్కని నటనను ప్రదర్శించారు. విధి నిర్వహణ పట్ల, అప్రమత్తత సంస్థ పట్ల అంకిత భావం, కుటుంబ బాధ్యతలు లిగిన కార్మికులుగా జర్పుల రాము, కోడి రెక్కల శ్రీనివాస్, నరసయ్య, చింతలశంకర్, సందీప్ లు చక్కని అభినయంతో నటించి తమ పాత్రలకు జీవం పోశారు. ప్రదర్శనలకు మరింత వన్నె తెచ్చే విధంగా ఆర్కెస్ట్రా బృందం రక్షణ గీతాలు అలపించగా కీబోర్డ్ ఎస్ డేవిడ్ రాజ్, రిథమ్ ప్యాడ్ డి ప్రవీణ్, ఫ్లూటు నరసయ్య చక్కని వాయిద్య సహకారం అందించారు. ఏరియా జీఎం దుర్గం రామచందర్, రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ సిహెచ్ వెంకటరమణ,



అధికారులు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు కళాకారులను నాట్య ప్రతిభను అభినందించారు. అనంతరం ముఖ్య అతిధులు కళాకారులను ప్రశంసిస్తూ జ్ఞాపికలను అందజేశారు. సింగరేణిలో కళాకారులకు కొదవలేదని ప్రశంసించారు. సింగరేణి ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు ఈ ప్రదర్శనను తిలకించారు.

## నేడు మొదటి విడత పోలింగ్

ఎన్నికలు మూడు విడతల్లో పూర్తి అయ్యే వరకు గ్రామాలలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, మొదటి, రెండవ దశలో ఎన్నికైన అభ్యర్థులు, ఇతరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదని, ఏకగ్రీవమైన గ్రామపంచాయతీలలో సైతం ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.పోలింగ్ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ప్రత్యేక అవసరాలున్న ఓటర్లకు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. నరసింహారావు, రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

ఏ తరహాలో మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించాల్సిన తీరుపై డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని ఎప్పటికప్పుడు థర్డ్ పార్టీ ఏజెన్సీతో క్వాలిటీ చెక్ జరగాలని మున్సిపల్ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. పనుల్లో అలస్యం జరిగితే ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితులు ఉంటాయని ఆ పరిస్థితి ఏర్పడవద్దని డిప్యూటీ సీఎం ఆదేశించారు. మధిర మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన నూతన భవన నమూనాలను ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ క్రమంలో స్థానికులు మంచి నీరు, వాహనాల రాకపోకల విషయంలో ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఒకవైపు మరోవైపు వేగంగా నాణ్యతతో పనులు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ వారి సిబ్బంది సమన్వయంతో పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. మున్సిపల్ వార్డుల వారీగా పరిస్థితిని డిప్యూటీ సీఎం సమీక్షించారు. నిర్లక్ష్యంగా ఉంటే కఠిన నిర్ణయాలు కూడాఉంటాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

## మండలంలో కలెక్టర్ పర్యటన



అవసరమైన సహకారం తక్షణమే అందించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన త్రాగునీరు, విశ్రాంతి గదులు, భోజన సదుపాయాలను కూడా పరిశీలించి, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందితో కలిసి భోజనం చేశారు.తరువాత కలెక్టర్ సుబ్బంపేట గ్రామంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన మౌలిక వసతులు, వికలాంగులకు ఏర్పాటు చేసిన ర్యాంపులు, త్రాగునీరు, విద్యుత్, టాయిలెట్ సదుపాయాలు, వెబ్కాస్టింగ్ కోసం అమర్చిన వీడియో కెమెరాల పనితీరును సమీక్షించారు. పోలింగ్ రోజున ఎటువంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు పూర్తి స్థాయిలో అమలులో ఉండాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ ఆర్.కొత్తగూడెంలోని శ్రీ ముత్యాలమ్మ జాయింట్ లయబిలిటీ యూనిట్ను సందర్శించి మహిళలు తయారు చేస్తున్న ఇప్పపువ్వు లడ్డు, బర్ఫీ, చాక్లెట్, టీ పొడి, నల్లేరు పచ్చడి తదితర ఉత్పత్తులను పరిశీలించారు. ఇప్పపువ్వు సేకరణ విధానం, నాణ్యత, నిల్వ విధానాలు, మార్కెటింగ్ అవకాశాలపై సభ్యులతో చర్చించారు. ఇప్ప చెట్ల లెక్కింపు చేపట్టాలని సూచిస్తూ, పండ్లు నేలపై పడకుండా నెమ్మదిగా సేకరించేందుకు అవసరమైన నెట్లను అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పపువ్వు ఎండబెట్టేందుకు సోలార్ డ్రైయర్లు అవసరం ఉందని సభ్యులు కోరగా, వాటి ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ సాయి వర్ధన్, డాక్టర్ కాంత్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రావణి, చర్ల ఎంపీడీవో, శ్రీ ముత్యాలమ్మ జాయింట్ లైబిలిటీ యూనిట్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.